క్లుప్తంగా

20 నుంచి క్రీడా పోటీలు

ఖాజీపేట : మండలంలోని పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి స్వర్ణలత తెలిపారు. ఈనెల 20, 21న ఈ పోటీలు జరుగుతాయన్నారు. 20న బాలురు, 21న బాలికలకు పోటీలు జరుపుతామన్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, కోకోతోపాటు పలు క్రీడల్లో నిర్వహిస్తామన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత



మద్యం బాటిళ్లతో ఎస్ఐ వెంకటరమణ

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన చీలి సుబ్బరాయుడు అక్రమంగా మద్యం అమ్ముతుండగా గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మండల ప్రత్యేక అధికారికి సన్మానం



నరసింహారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓలు

బ్రహ్మంగారిమఠం : మండల ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న నరసింహారెడ్డి కాశినాయన మండలానికి బదిలీ కావడంతో గురువారం బి.మఠం ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సూచనలు చేస్తున్న అధికారులు

ఖాజీపేట : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, దీనివల్ల తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారని సీడీపీఓ శ్రీదేవి సూచించారు. దుంపలగట్టు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భిణులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణుల్లో ఎక్కువగా రక్తహీనత ఉంటుందని అన్నారు. మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఈ సమస్య అధిగమించవచ్చన్నారు. గర్భిణులు క్రమం తప్పక వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ జహ్రాబీతోపాటు అంగన్‌వాడీ సభ్యులు పాల్గొన్నారు.

పాత్రికేయుడికి ఘన నివాళి

ఖాజీపేట : సీనియర్ పాత్రికేయుడు బొంగు శ్రీనివాసులుకు మండలంలోని ప్రముఖులు ఘన నివాళి అర్పించారు. సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించే దిశగా చూపిన చొరవను వారు కొనియాడారు. గురువారం మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి నివాళి అర్పించారు.

వీఆర్ఏ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా హరికృష్ణ

బద్వేలు అర్బన్ : ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బద్వేలుకు చెందిన గుర్రాల హరికృష్ణ నియమితులయ్యారు. రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. హరికృష్ణ మాట్లాడుతూ గతంలో తాను బద్వేలు రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా, కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశానని, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో మరింతగా పనిచేసేందుకు అసోసియేషన్ తరపున వీఆర్ఏలకు అండగా నిలబడి పనిచేస్తానని తెలిపారు.

మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడలు ప్రారంభం

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ క్రీడలను ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలినిలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యతను పెంచేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం వారిని స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్ సుమన్ సన్మానించారు. వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యత



ప్రొద్దుటూరు : చెత్త డంప్ తొలగింపును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్



మైదుకూరు: స్వచ్ఛతా హీ సేవాపై ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రొద్దుటూరు : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని స్వరూప్ కంటి ఆస్పత్రి పక్కన గల చెత్త డంప్‌ను స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, శానిటరీ కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, కరుణశ్రీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

దువ్వూరు : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ పేర్కొన్నారు. గురువారం దువ్వూరు జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ చెంద్రాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సమక్షంలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల స్వచ్ఛతే సామాజిక సేవ

మైదుకూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే సామాజిక సేవ అని మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం కళాశాల విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పర్యావరణం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ జరిపారు. అనంతరం కళాశాల పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, విద్యార్థులు సమష్టిగా పాల్గొని తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో చురుకుగా పాల్గొంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలో, కార్యాలయాల్లో, పబ్లిక్ స్థలాల్లో పరిశుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుభాన్‌సాహెబ్, అయ్యవారురెడ్డి, డాక్టర్ సి.నరసింహారావు, డాక్టర్ ఎస్.నవనీశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, చెన్నరాయుడు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు పారిశుధ్యంపై ర్యాలీ

చాపాడు : స్వచ్ఛతా హీ సేవా కార్యాక్రమంలో భాగంగా గురువారం మూడో రోజు పారిశుధ్యంపై ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు అధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 2వ తేదీ వరకూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై ప్రజలు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



దువ్వూరు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



చాపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ముస్లిం మతపెద్దలతో ఎంపీ భేటీ



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరం బాలాజీ నగర్‌లోని అబ్బాస్ మసీదు(మర్కస్)లో ముస్లిం మత పెద్దలతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ చర్చల్లో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లుపై మత పెద్దల అభిప్రాయాలు స్వీకరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల రక్షణ, భద్రత తమ పార్టీ విధానమని, ఈ బిల్లును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ ఎంపికలు



పరుగు పోటీల్లో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో గురువారం మండల స్థాయి ఎస్జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికలకు ఎంపికలు జరిగాయి. ఈ పోటీలను ఎంఈఓ సావిత్రమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, 100మీ, 200మీ, 400మీ, 800 మీటర్ల పరుగు పోటీలు, 4''100 రిలే పరుగు పోటీలు, సెటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా ప్రతిభతో ఆకట్టుకున్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు 24 జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ మండల స్థాయి పోటీల నిర్వాహకులు షేక్‌బాబు, ఓబయ్య తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు. ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్‌సీపీఈ కళాశాల విద్యార్థులు పర్యవేక్షించారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్

రాజుపాళెం : సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ అన్నారు. రాజుపాళెంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉన్న సమస్యలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలలుగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదని తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా ఇన్‌చార్జి వార్డెన్లు, అద్దె భవనాలలో హాస్టళ్లు అరకొర వసతులతో ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతున్న హాస్టళ్లను రీమోడలింగ్ చేయకుండా, కొత్త భవనాలను నిర్మించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. వార్డెన్లకు నెలనెలా మెస్ బిల్లులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా హాస్టళ్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీఈలో ఘనంగా రూబీ జూబ్లీ ఉత్సవాలు



డాక్టర్ ఎంవీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం రూబీ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవిశంకర్ మాట్లాడుతూ దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి వ్యాయామ విద్యను ప్రోత్సహించడానికి ఈ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో వ్యాయమ విద్య అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఈ కళాశాలను రాష్ట్రస్థాయి కళాశాలగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీనితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ విద్యార్థులకు వ్యాయామ విద్యను అభ్యసించడానికి అవకాశం కలిగిందన్నారు. 40 సంవత్సరాలలో వేలాది మంది వ్యాయామ ఉపాధ్యాయులుగా శిక్షణ పొంది రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఉపాధి అవకాశాలు పొందారన్నారు. ప్రైవేటు విద్యా రంగంలో సేవా దృక్పథంతో కళాశాల నడుప బడుతోందని, దక్షిణ భారత దేశంలోనే ఉత్తమ వ్యాయామ విద్యా కళాశాలల్లో ఒకటిగా పేరుగాంచిందన్నారు. ఎంవీ రమణారెడ్డి విగ్రహానికి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

అన్న క్యాంటిన్ ప్రారంభం నేటికి వాయిదా

ప్రొద్దుటూరు : స్థానిక టీబీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించనున్నారు. ముందుగా తెలిపిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం అన్న క్యాంటిన్‌ను ప్రారంభించాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవాన్ని శుక్రవారానికి వాయిదా వేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే వార్డు సచివాలయాన్ని మార్చి అన్న క్యాంటిన్ ఏర్పాటు చేశారు.

వరద బాధితులకు సాయం



పంపిణీ చేయనున్న సరుకులతో పుణ్యధామం ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడ వరద బాధితులకు అఖిలభారత బ్రాహ్మణ ఉత్తర క్రియా పుణ్యధామం సొసైటీ ఆధ్వర్యంలో రూ.90 వేల విలువ చేసే వస్త్రాలు, నిత్యావసర వస్తువులను అందించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సాతవెల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. సొసైటీ తరపున దాతల సహకారంతో 250 చీరలు, 300 పంచలు, 250 జాకెట్ పీసులు, 250 టవళ్లు, 20 బియ్యం ప్యాకెట్లు, 25 చక్కెర ప్యాకెట్‌లు, 100 కిలోల కందిపప్పు, కూరగాయలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం రాత్రి సరుకులను విజయవాడకు తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధనుంజయ శర్మ, ఆర్థిక కార్యదర్శి వెల్లాల నరసింహాశర్మ, ఉపాధ్యక్షులు వెల్లాల కొదండరామశర్మ, హరినాథ్‌శర్మ, దుర్భాక సుబ్బనరసయ్య శర్మ, ఎస్. లక్ష్మీనారాయణ కుమార్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకోవాలి



కబ్జాకు గురైన భూములను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అట్లూరు : మండల పరిధిలోని నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో సర్వేనెంబరు 40లో భూపోరాటం చేస్తున్న పేదలను ఆయన గురువారం కలిసి వారికి మద్దతు తెలిపారు. అనంతరం కబ్జాకు గురైన భూములను పరిశీలించి మాట్లాడారు. పేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూములు నానాటికి హారతి కర్పూరంలా కరిగి పోతున్నాయన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం సాధారణమైందన్నారు. గతంలో సోమశిల ముంపు వాసులకు ఇచ్చిన భూములు సైతం ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అసైన్‌మెంటు కమిటీ ద్వారా పేదలకు పట్టాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, దుర్గమ్మ, చంద్రా, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూఏ బీటెక్ తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరచారు. సివిల్ విభాగంలో పవన్‌కుమార్‌రెడ్డి 87.22, వసంత 85.22, చంద్రిక 82.20, ట్రిపుల్‌ఈలో గురుసుప్రియ 89.56, నిఖిత 89.44, సుమంత్ 89.22, ఈసీఈలో సునీత 87, ప్రవీణ 86.67, గాయత్రీదేవి 87.11, సీఎస్ఈలో మహేశ్వరి 84.78, షేక్‌మహ్మద్ సాహిల్ 84, సాయిశైలజ 83.67 శాతం మార్కులు సాధించారు. వారిని చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన

కలసపాడు : మండలంలోని రాజుపాలెం, కలసపాడు, ముసల్‌రెడ్డిపల్లె, సిద్దమూర్తిపల్లె గ్రామాల్లో గురువారం నవభారత్ ఫర్టిలైజర్స్ వారి ఆధ్వర్యంలో సేంద్రియ, జీవన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ సుదర్శనాచారి మాట్లాడుతూ పంట సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని అన్నారు. రసాయన ఎరువుల వాడకం వలన క్రమక్రమంగా భూముల్లో భూసార తగ్గిపోయి పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. సేంద్రియ, జీవన ఎరువులు వాడటం వలన పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో నవభారత్ ఫర్టిలైజర్స్ ఏబీఎం చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

జీఓ 117తో ప్రభుత్వ విద్యా రంగానికి నష్టం



వెలవలిలో ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి

రాజుపాళెం : ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూర్చే జీఓ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ జీఓ వల్ల ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను వేరు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయిపోయాయన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, రాజుపాళెం మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింహాకుమార్, రామదస్తగిరిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరణ



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

బి.కోడూరు : మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రాలను జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు దేవదత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలజయన్న, జిల్లా సీనియర్ నాయకులు శ్రీరాములు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండలస్థాయి, అక్టోబర్ 27న జిల్లాస్థాయి, నవంబర్ 9, 10వ తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుండి 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సైన్స్ సంబరాలకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించబడుతున్నాన్నారు. ఈ పరీక్ష పేపర్లు తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ఉంటుందని, ప్రతి పాఠశాల నుండి 8, 9, 10 తరగతుల నుండి ఒక్కొక్క తరగతి నుండి ఒకరిని ఎంపిక చేసి ఒక పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులను మండల స్థాయికి పంపడం జరుగుతుందని, ఈ విధంగా మండల స్థాయిలో ప్రతి పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఈ సంబరాలలో పాల్గొంటారన్నారు. ఇదేవిధంగా రాష్ట్రస్థాయి వరకు పంపించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనతోనే అభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వినోద్ కుమార్

దువ్వూరు : మాదకద్రవ్యాల రహిత సమాజంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. గురువారం దువ్వూరులోని షిర్డీ సాయి పాఠశాల విద్యార్థులు, వినాయక ఫౌండేషన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పానీయాలు, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు చేసుకోకూడదని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. అనంతరం దువ్వూరు మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

అంతర్‌జిల్లా సైబర్ నేరగాళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: వాట్సాప్ వీడియో కాల్ ద్వారా తాము ముంబయి పోలీసులమంటూ బెదిరించి ధర్మవరంలోని ఓ వైద్యుడి నుంచి రూ.33 లక్షలను కాజేసిన సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ వి.రత్న వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 18న ధర్మవరానికి చెందిన డాక్టర్ తరుగు సూర్యనారాయణరెడ్డికి 9177597242 నంబర్‌తో వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. ఆగంతకుడు తాను ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నట్లుగా తెలిపాడు. నరేష్ గోయల్ అనే వ్యక్తి కెనరా బ్యాంకు ద్వారా రూ.500 కోట్లు అప్పుగా తీసుకుని, ఆ డబ్బు సంస్థకు వాడకుండా వివిధ ఖాతాల్లో జమ చేశాడని, ఇందులో మీ అకౌంట్ కూడా ఉందంటూ డాక్టర్‌ను బెదిరించాడు. రూ.20 లక్షలు తీసుకున్నట్లుగా కేసు నమోదైనట్లుగా తెలిపాడు. డాక్టర్ నమ్మక పోవడంతో డాక్టర్‌కు సంబంధించి తన వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డు, నకిలీ బ్యాంక్ స్టేట్‌మెంట్, ఫేక్ డెబిట్‌కార్డు చూపించి నమ్మించాడు. ధర్మవరానికి వచ్చి డాక్టర్‌తో పాటు కుటుంబసభ్యులనూ అరెస్ట్ చేసి ముంబయికి తీసుకెళతామని బెదిరించాడు. ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ.33 లక్షలు చెల్లించాలని సూచించాడు. అప్పటికే బెదిరింపులతో బెంబేలెత్తిన డాక్టర్ అనాలోచితంగా ఆగస్టు 20న స్థానిక బ్యాంక్ ఖాతా నుంచి రూ.20 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా వారు చెప్పిన బ్యాంకు ఖాతా 885621000018823 (మంగమద్దల ఎంటర్‌ప్రైజెస్)కు బదిలీ చేశాడు. అనంతరం ఐడీబీఐ నుంచి అదే అకౌంట్‌కు మరో రూ.13 లక్షలు జమ చేశాడు. రెండు రోజుల తర్వాత తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు నిర్ధారించుకుని ఆగస్టు 22న ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సీఐ తిమ్మారెడ్డి పక్కా ఆధారాలతో సైబర్ నేరాగాళ్లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసి ఇలియాజర్, పుట్లంపల్లి మండలం శివానందపురం గ్రామానికి చెందిన నగలరాపు స్వామిదాసు, నంద్యాల జిల్లా అయ్యలూరుమెట్టకు చెందిన మంగమద్దెల ప్రష్లోద్, ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన బెలగడ కిషోర్, నంద్యాలలోని వెంకటచాలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడపల్లి గ్రామానికి చెందిన జావీద్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జంప్ రోప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వన్‌టౌన్ సమీపంలోని ఇస్లామిక్ హైస్కూల్ విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్ర నాందేడ్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొన్న ఆరో తరగతి విద్యార్థిని ఆసియా, 7వ తరగతి విద్యార్థిని సల్మా ప్రతిభ కనపరచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్‌లో బ్యాంకాక్ దేశంలో జరుగనున్న అంతర్జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కరస్పాండెంట్ ఉమర్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

అట్లూరు : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే అధిక దిగుబడులు సాదించవచ్చని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. బద్వేలు మండలంలోని చింతలచెరువు రైతు సేవాకేంద్రం బయనపల్లి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరినాట్ల సమయంలో కొనలు తుంచి నాటాలన్నారు. అలాగే కాలిబాటలు వదిలి వరినాట్లు వేస్తే తెగుళ్ల ఉధృతి తగ్గుతుందన్నారు. రైతులు మిత్రపురుగులు, శత్రు పురుగులను గుర్తించాలన్నారు. ప్రస్తుతం వరిపైరులో ఆకుముడత కాండం తొలుచు తెగులు ఆశించిందన్నారు. వాటి నివారణకు మందులు పిచికారి విదానం వివరించారు. అలాగే వరిగెట్ల వెంబడి చెండుమల్లి, ఆముదం, కంది మొక్కలను సాగు చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు పవణ్‌కుమార్, పకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.